క్లుప్తంగా

రేషన్ సరుకుల పంపిణీ పరిశీలన



రేషన్ సరుకుల పంపిణీని పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ సుధాకర్

బాడంగి: మండల కేంద్రంలోని రేషన్ డిపో -1,2లలో రేషన్ సరుకుల పంపిణీని తహసీల్దార్ కె.సుధాకర్ మంగళవారం పరిశీలించారు. సరుకుల పంపిణీ సక్రమంగా చేపట్టాలని డీలర్లను తహసీల్దార్ ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే సరుకులు చేర్చాలని సూచించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ సరుకులు తీసుకున్నప్పుడే తూకం సరిపోయిందా లేదా అని సరిచూసుకోవాలని చెప్పారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ

వంగర: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ సూచించారు. మండలంలోని అరసాడ పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. జ్వర పీడితులున్న గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్యాధికారులు కె.ఈశ్వరరావు, సౌజన్య పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు ఇచ్చేదెప్పుడు..?



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రేగిడి: రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా కొత్త పింఛన్‌లు మంజూరు చేయలేదని, ఎప్పుడు ఇస్తారో చెప్పాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాజాం నియోజకవర్గ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని నిలదీశారు. మండలంలోని మజ్జిరాముని పేటలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమూ అమలు చేయాలని, అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇచ్చిన హామీ మేరకు 50 సంవత్సరాలు దాటిన బీసీలకు పింఛన్లు అందించాలని కోరారు.సర్పంచ్‌లు కెంబూరు వెంకటేశ్వరరావు, గార రమణ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీలు



శ్యాంపురం సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ, సక్రమంగా సేవలందించాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని శ్యాంపురం, పెనుబాక, బొద్దాం తదితర గ్రామాల సచివాలయాల్లో మంగళవారం తనిఖీలు చేశారు. సిబ్బంది హాజరు, సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రజలు అందించిన అర్జీల్లో ఎన్నింటికి పరిష్కారం చూపారని, అలాగే పింఛన్ల పంపిణీపై ఆరా తీశారు. అనంతరం ఆయా గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సందర్శించారు.ఎంపీడీఓ వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ విజయబాబు

తెర్లాం: కిశోరీ బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మండల సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి, కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు అన్నారు. కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా కూనాయవలస గ్రామ సచివాలయంలో కిశోరీ బాలికలకు ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్య, తదితరం అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ మాట్లాడుతూ బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకోవాలని, బాలికలు, మహిళల రక్షణకు సంబంధించి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అన్నారు. కూనాయ వలస, జన్నివలస గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

• నాయనా... ఇది వెన్నుపోటు కాదా..?

- సెల్ఫీలు, పాదయాత్రలే మిగిలాయి
- రోడ్ల విస్తరణ,పునరుద్ధరణ ఊసే లేదు
- గ్రోత్ సెంటర్‌లో ఒక్క కొత్త పరిశ్రమ కూడా రాలేదు
- గొల్లాది వంతెన నిర్మాణ హామీపై అతీగతి లేదు



బొబ్బిలి కాలేజ్ రోడ్డు దుస్థితి



బాడంగి మండలం గొల్లాది వద్ద వంతెన నిర్మించాల్సిన ప్రాంతమిదే

బొబ్బిలి: తనని గెలిపిస్తే నియోజకవర్గాన్ని వైభవంగా తీర్చిదిద్దుతానని, అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తానని 2024లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా బేబీ నాయన ఊరూరా ఊదర గొట్టారు. కూటమి పెద్దలకు ధీటుగా తాను కూడా అనేక హామీలను గుప్పించారు. అయితే ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలకు మొహం చాటేశారు. బేబీ నాయన ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది పూర్తయినా ఆయన ఇచ్చిన ఏ హామీ కూడా అమలుకు నోచుకోలే దు. ఎక్కడా అభివృద్ధి పనులు జరగడం లేదు. ఎమ్మెల్యే బేబీ నాయన ఇచ్చిన హామీలను గుర్తు చేసుకుందాం ..

- బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో కొత్త పరిశ్రమలు వచ్చేలా కృషి చేస్తానని గడిచిన ఎన్నికల ప్రచారంలో చెప్పారు. అలా ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు లభించేలా చర్యలు తీసుకుంటానన్నారు.తాను గెలుపొందిన ఏడాదిలో కనీసం గ్రోత్‌సెంటర్‌ను సందర్శించిన పాపాన కూడా పోలేదు.
- నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థను ఏర్పాటు చేసి ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికీ ఆ దిశగా ముందడుగు పడలేదు.
- అన్నింటికంటే ముఖ్యమైన హామీ బొబ్బిలి పట్టణంలోని రాజా కాలేజ్ రోడ్డు, బజారు రోడ్డు విస్తరణ. ఈ రోడ్ల విస్తరణ విషయమై ఇప్పటి వరకు మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశం కూడా నిర్వహించలేదు.
- రామభద్రపురం మండల కేంద్రంలోని మార్కెట్‌ను విస్తరిస్తామన్నారు. దీనికి సంబంధించి ఎలాంటి చర్యలు లేవు.
- పాత రేగ, కొత్తరేగ మధ్యలో ఏడొంపుల గెడ్డపై కాజ్‌వే నిర్మిస్తామన్నారు.
- రామభద్రపురం మండలం కొండకెంగువ గ్రామాన్ని దత్తత తీసుకుంటామని, అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. దీనికి సంబంధించి ఆయన తీసుకున్న చర్యలేమీ లేవు.
- బాడంగి మండలం గొల్లాది వద్ద వేగావతి నదిపై బ్రిడ్జి నిర్మాణం నా కల అని ఎన్నికైన వెంటనే బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పారు. కానీ నేటికీ దానిపై ఎటువంటి సమావేశం కానీ, ప్రస్తావన కానీ లేదు.
- బొబ్బిలి మండలంలోని రాముడువలస, తెర్లాం మండలంలోని లోచర్ల ప్రాంతాల్లోని తోటపల్లి కాలువపై ఎత్తిపోతల పథకాలను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామ న్నారు. కానీ వీటికి సంబంధించి అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావనే మిగిలింది తప్ప ఎటువంటి చర్యలు లేవు.
- నియోజకవర్గంలోని మక్కువ రహదారి, తెర్లాం -బొబ్బిలి, రామభద్రపురం-బొబ్బిలి, ఉత్తరావిల్లి, బాడంగి, రామభద్రపురం రహదారులు పాడయ్యాయని, వాటిని తాను అధికారంలోకి వచ్చాక కొత్త రోడ్లుగా చేస్తాననీ, అప్పటివరకూ గుంతలైనా కప్పాలని సెల్ఫీ చాలెంజ్‌లు విసిరి, పాదయాత్రలు చేసిన బేబీ నాయన నేటికీ ఆయా రహదారుల్లో గుంతలను కూడా పూర్తిగా కప్పలేకపోయారు. ప్రజలు, పోలీసులు భవన నిర్మాణవ్యర్థాలను తెచ్చి రోడ్లపై గుంతలను పూడ్చుకోవాల్సి వస్తోంది.
- తాను ఇచ్చిన హామీలపై ప్రజలు ప్రశ్నించకుండా బేబీ నాయన మాటల చాతుర్యంతో మరుగున పడేస్తున్నారన్న వ్యాఖ్యలు మాత్రం బహిరంగంగానే వినపడుతున్నాయి. తన హామీలు తనకి గుర్తున్నాయా లేవానని జనం మాట్లాడుకోవడం చర్చనీయాంశమవుతోంది.

అన్నదాతల సంక్షేమాన్ని విస్మరించారు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామారావు

మెంటాడ: కూటమి ప్రభుత్వం అన్నదాతల సంక్షేమాన్ని విస్మరించిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు అన్నారు. ఇద్దనవలస గ్రామంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదవుతోందని, ఇంతవరకు రైతులకు సాగు పెట్టుబడి సాయంగా ఒక్క రూపాయి కూడా అందించలేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, పంటలకు ఉచిత బీమా పథకాన్ని నిలిపేశారని మండిపడ్డారు. రైతులకు ఈ ప్రభుత్వం కనీసం పచ్చిరొట్ట విత్తనాలను కూడా పూర్తిస్థాయిలో అందించలేని దౌర్భాగ్య స్థితిలో ఉందన్నారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇద్దనవలస గ్రామానికి సీజన్‌కి 7 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తే.. ఈ ప్రభుత్వం కేవలం రెండు క్వింటాళ్ల విత్తనాలను మాత్రమే పంపిణీ చేసిందని, వాటిని మంత్రి సంధ్యారాణి చేతుల మీదుగా పంపిణీ చేసి హడావిడి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విత్తనాల కోసం రైతులు ఇబ్బంది పడిన సంఘటనలు లేవని గుర్తు చేశారు. రైతులకు కావాల్సినన్ని విత్తనాలు అందించామన్నారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి రూ. 15 లక్షల విలువైన వ్యవసాయం యంత్ర పరికరాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసిందని, ఇప్పుడు ఒక్క రైతుకు కూడా యంత్ర పరికరాలు అందించలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనూ అమలు చేయకుండా సీఎం చంద్రబాబు, కూటమి పెద్దలు మాటలతో కాలయాపన చేస్తున్నారన్నారు. వైస్ ఎంపీపీ సారికి ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల దోపిడీని అడ్డుకోండి



ఎంఈఓ దుర్గారావుకు సమస్యను వివరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాజాం సిటీ: ప్రైవేటు పాఠశాలల దోపిడీని అడ్డుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఈఓ వై.దుర్గారావును కోరారు. మంగళవారం పట్టణంలోని అభ్యాస్ పాఠశాలలో పుస్తకాల అమ్మకాన్ని అడ్డుకున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్ తెలిపారు.అయితే ఈక్రమంలో తనపై ప్రిన్సిపాల్ దుర్భాషలాడుతూ భౌతిక దాడికి దిగారని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈఓ వై.దుర్గారావు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన యాజమాన్యంపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారని రవికుమార్ తెలిపారు. విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులుపై దాడికి దిగడం హేయమైన చర్యని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్, వంశీ, నాని, రమణ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలి



సమావేశమైన ఎండీఎం కార్మికులు

బొబ్బిలి: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం)కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. పట్టణంలో ఎండీఎం కార్మికులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీఎం కార్మికులకు కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత,బీమా కల్పించాలని, యూనిఫాం కేటాయించాలన్నారు. మెనూ ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల మార్పునకు, లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలన్నారు.ఇందుకోసం జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు ఎస్.గోపాలం, ఎండీఎం సంఘ నాయకులు రామలక్ష్మి, ఆదిలక్ష్మి, చంద్రకళ, రాములమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు రేషన్ షాపులకు వెళ్లొద్దు

- మధ్యాహ్నం వేళ డీలర్లే ఇళ్లకు వచ్చి సరుకులు ఇస్తారు
- ఆర్డీఓ రామమోహనరావు



బొబ్బిలి: రేషన్ సరుకుల కోసం 65 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులు రేషన్ షాపుల వద్దకు వెళ్లనవసరం లేదని, రేషన్ డీలర్లే స్వయంగా వారి ఇళ్ల కు వెళ్లి సరుకులు అందజేస్తారని ఆర్డీఓ జె.వి.ఎస్.ఎస్.రామమోహనరావు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు డీలర్లు వెళ్లి సరుకులు అందజేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఆక్రమిత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు దరఖాస్తు చేసుకుంటే వాటిని క్రమబద్ధీకరిస్తామని, ఇందుకోసం కరెంటు బిల్లు లేదా ఇతర ఏ విధమైన ఆధారాలున్నా వీఆర్‌ఓల ద్వారా సమర్పించాలన్నారు. డివిజన్‌లోని ఇల్లు లేని పేదలకు పట్టణాల్లో అయితే 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే గిరిజన యూనివర్సిటీకి రహదారి నిమిత్తం భూసేకరణ కోసం 4.50 ఎకరాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదించామని, ప్రభుత్వం నుంచి నిధులు వస్తే కొత్త భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందజేస్తామన్నారు.

పోలింగ్ బూత్‌ల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

బొబ్బిలి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లకు కనీస సౌకర్యాలు ఉండాలని ఆర్డీఓ రామమోహనరావు అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలను, సూచనలను ప్రతినిధులకు తెలియజేశారు. ఎన్నికల ఉప తహసీల్దార్ బలివాడ గౌరీశంకరరావు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు టి.సంతోష్ కుమార్, వి.సత్యనారాయణ, తాడ్డి ఈశ్వరరావు, పొట్నూరు శంకరరావు, ఎస్.గోపాలం పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10 వేలు జరిమానా

రామభద్రపురం: మద్యం తాగి వాహనం నడుపుతూ మండల పోలీసులకు పట్టుబడిన వ్యక్తికి సాలూరు కోర్టు జడ్జి హర్షవర్ధన్ రూ.10 వేలు జరిమానా విధించారని ఎస్ఐ వి.ప్రసాదరావు మంగళవారం తెలిపారు. బాడంగి మండలం డొంకినవలస గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడడంతో కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ చెప్పారు.సదరు వ్యక్తికి కోర్టు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చిందని తెలిపారు.

అప్రెంటీస్ మేళా రేపు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 5వ తేదీన అప్రెంటీస్ జాబ్‌మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మేధా సెర్వో కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో అప్రెంటీస్ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లలో శిక్షణ పూర్తిచేసుకున్న, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో రూ. 15వేల స్టైఫండ్ ఇవ్వనున్నారని, 18 నుంచి 20 ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

యోగాతో ఆరోగ్యం



తెర్లాం:నెమలాం హైస్కూల్‌లో ఆసనాలు వేస్తున్న గ్రామస్తులు

తెర్లాం: రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ రాంబాబు అన్నారు. యోగా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని నెమలాం హైస్కూల్‌లో స్థానికులకు మంగళవారం యోగాపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతులను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా చేయాలన్నారు. యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఒత్తిడిని అధిగమించ వచ్చన్నారు. నెమలాం, పెరుమాళి హైస్కూళ్ల పీడీలు పాల్గొన్నారు.

సచివాలయ స్థాయిలో ఎంపికలు

బొబ్బిలిరూరల్: యోగాంధ్రాలో భాగంగా సచివాలయాల పరిధిలో యోగా శిక్షణ పొందుతున్న వారిలో ప్రతిభావంతులను ఎంపిక చేస్తున్నా మని ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సచివాలయాల స్థాయిలో మంచి ప్రతిభకనబరిచిన వారిని మండల స్థాయి పోటీలకు పంపిస్తామని వివరించారు. మంగళవారం నుంచి ఈనెల 12 వరకు ఈ ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



ప్రతిష్ఠోత్సవాలకు సిద్ధమైన ఆంజనేయ సమేత వేణుగోపాలకృష్ణ ఆలయం

సంతకవిటి: మండలంలోని కృష్ణంవలస గ్రామంలో అభయాంజనేయ సమేత వేణుగోపాలకృష్ణ ఆలయ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. వేదపండితులు పెంట వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ప్రతిష్ఠ సంకల్పంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, గ్రామ ప్రదక్షిణ, జలాదివాసం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండో రోజు గురువారం సూర్యనమస్కారాలు, క్షీరాధివాసం, మూడోరోజు శుక్రవారం విగ్రహాలను ప్రతిష్ఠించనున్నామని, మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



బూసాయవలసలో ఎర్రన్న చెరువు సాగునీటి కాలువను పరిశీలిస్తున్న తహసీల్దార్ సులోచనరాణి

రామభద్రపురం: ప్రభుత్వ భూములు,చెరువులు,వాగులు,సాగునీటి కాలువలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఏ.సులోచనరాణి హెచ్చరించారు. మండలంలోని బూసాయవలస రెవెన్యూ పరిధిలోని ఎర్రన్న చెరువు గర్భంతో పాటు ఆ చెరువుకు వచ్చే సాగునీటి కాలువలు, అలాగే మండల కేంద్రంలోని చొక్కాపు వాని చెరువు ఆక్రమణలకు గురయ్యాయని ఫిర్యాదులు అందాయి. దీంతో ఇరిగేషన్ ఏఈలు హరిబాబు ,వెంకట్‌తో కలిసి తహసీల్దార్ ఆ చెరువులను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువులకు సర్వే చేసి హద్దులు నిర్ధారిస్తామని చెప్పారు. ఆక్రమణలకు పాల్పడిన వారికి నోటీసులు ఇచ్చి ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. తహసీల్దార్ వెంట వీఆర్‌ఓ రామకృష్ణ ఉన్నారు.

పరామర్శ



సూరపునాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కర్నేన సూరపునాయుడు(హరికృష్ణ) ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. పార్టీకి సూరపునాయుడు అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ అన్నారు. మృతుడు సూరపనాయుడు బావమరుదులు సర్పంచ్ కెంబూరి వెంకటేశ్వరరావు,సంకిలి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెంబూరి గోపాలకృష్ణకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ లచ్చుంనాయుడు, వావిలపల్లి జగన్‌మోనరావు , వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు,ఎంపీటీసీలు ఏర్నేన అప్పలనాయుడు, తదితరులు ఉన్నారు.

'వెన్నుపోటు దినం'కు తరలిరండి



తెర్లాం: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



బాడంగి: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తెర్లాం/బాడంగి: ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిన టీడీపీ కూటమి ప్రభుత్వం తీరుకు నిరస నగా మాజీ ముఖ్య మంత్రి, వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు బుధవారం 'వెన్నుపోటు దినం' కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ తెర్లాం, బాడంగి మండలాల అధ్యక్షులు తెంటు సత్యంనాయుడు, యామలి శివప్రసాద్ తెలిపారు. వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయా మండల కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బొబ్బిలిలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. తెర్లాం మండల ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధులు బాబ్జీరావు, రామారావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, బాడంగి జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీపీ ప్రతినిధి తెంటు మధుసూదనరావు, నాయకులు ఆవు సత్యనారాయణ,మరిపి శంకరరావు, పూడి సూర్యనారాయణ,రెడ్డి కృష్ణ, సూర్యనారాయణరాజు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

లీగల్ ఎయిర్ క్లినిక్‌లతో న్యాయ సహాయం



రిమాండ్ ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా జడ్జి బబిత

బొబ్బిలి: సబ్ జైళ్లలో ఉన్న రిమాండ్ ఖైదీలకు సకాలంలో న్యాయ సహాయం అందేందుకు జైల్ లీగల్ ఎయిర్ క్లినిక్‌లను ఏర్పాటు చేశామని జిల్లా జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. బబిత అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక సబ్ జైలును ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీలపై సిబ్బంది కానీ, తోటి ఖైదీలు కానీ వివక్ష చూపకూడదన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె సుప్రీం చట్టాలను వివరించారు. ఈ అంశాలపై సూపరింటెండెంట్ పాత్రో ను మరిన్ని వివరాలడిగి తెలుసుకున్నారు. వంటగది, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేశారు. సౌకర్యాలపై ఖైదీలను ఆరా తీశారు. ఆమె వెంట స్థానిక కోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది ఉన్నారు.

రేషన్ పంపిణీలో సర్వర్ సమస్యలు



బొబ్బిలిలోని 315 రేషన్ షాపులో డబ్బాలతో బియ్యం కొలుస్తున్న దృశ్యం



బొబ్బిలి పట్టణ డీలర్ల సంఘం అధ్యక్షుడు గౌరీశంకరరావు

బొబ్బిలి: రేషన్ పంపిణీలో సర్వర్ సమస్యలు ఎదురవుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని రేషన్ డీలర్లు వాపోతున్నారు. ఈనెల 1వ తేదీన రేషన్ పంపిణీ ప్రారంభించినప్పటికీ పట్టణంలోని కొన్ని రేషన్ షాపుల్లో 50 శాతం కూడా పంపిణీ పూర్తి కాలేదు. పట్టణంలోని 315 నెంబరు రేషన్ షాపుతో పాటు పలు రేషన్ షాపుల్లో అంచనా కట్టి డబ్బాలతో బియ్యం ఇస్తుండడంతో తూకం తక్కువ వస్తున్నట్టు వినియోగదారులు వాపోతున్నారు.

మాకు డేటా ఇవ్వలేదు:

వృద్ధులకు రేషన్ డీలర్లే స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి బియ్యం, పంచదార ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ డేటా ఇవ్వకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారు. తెలిసిన ఒకరిద్దరికి తామే ఇచ్చినా ఇతర వృద్ధుల డేటా తమ వద్ద లేదని, అధికారులు కూడా ఇవ్వలేదని పట్టణ రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు, యాతవీధి రేషన్ డీలర్ కోరాడ గౌరీశంకరరావు అన్నారు. చాలా సంవత్సరాలుగా తాము రేషన్ ఇవ్వలేదని, ఎండీయూ వాహనాల ఆపరేటర్లు సరుకులు ఇచ్చేవారని చెప్పారు. అధికారులు వృద్ధుల వివరాలు ఇచ్చి సహకరించాలని కోరారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

మెంటాడ: ఇద్దనవలస గ్రామంలో రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రాయితీలను సద్వినియోగించుకోవాలని అన్నారు. మండలానికి రూ. 5 కోట్లతో వ్యవసాయ యంత్రపరికరాలను అందించామని చెప్పారు. టీడీపీ సీనియర్ నాయకులు గెద్ద అన్నవరం, అధికారులు పాల్గొన్నారు.